# దశ

నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

శనివారం 05 07 2025

సంపుటి 1 సంచిక 66

పేజీలు : 03

UDYAM / TS-09-0148996



విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఆసక్తి గల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
ఆర్.సీ. ఇన్చార్జులు
మండల రిపోర్టర్లు
క్రైమ్ రిపోర్టర్లు

దశ నిజం.. నిర్భయంగా.. PRESS
ప్రత్యేక ప్రతినిధి తెలంగాణ
Off. Add.: H. No. 2-1-131/97, 1st floor, Rd no 6, Venkatramana Colony, Nagol, Hyderabad -TG - 500068.
www.DASHANEWS.com

(మీ వివరాలను వాట్సప్లో పంపగలరు)

73375 46647


# మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే..



## సాగర్ కు పోటెత్తిన వరద నీరు

కృష్ణ బేసిన్ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల నిండుకుండలా మారి వరదంతా శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ ఫ్లో రూపంలో దూసుకొస్తుంది. ఇక.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం 52 వేల క్యూసెక్కుల వరదనీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో.. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కుల నీటిని.. ఖమ్మం జిల్లా తాగునీటి కోసం పాలేరు జలాశయానికి ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. మొదటగా వెయ్యి క్యూసెక్కులను విడుదల చేయగా.. క్రమేపి 3 వేల క్యూసెక్కుల వరకు పెంచనున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను.. ప్రస్తుతం 521.90 అడుగులకు చేరుకుంది. అలాగే.. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసీ లకు గానూ.. ప్రజెంట్ 152.7628 టిఎంసీ లుగా ఉంది. ఏఎంఆర్పీ, ఎస్ఎల్బీసీ ద్వారా హైదరాబాద్ మహానగరానికి నిరంతరాయంగా 900 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది..

**దశ, నల్గొండ**

## ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ భయపడలేదు

### క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని..

### ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఖర్గే





**దశ, హైదరాబాద్:** ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ భయపడ లేదని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే గుర్తు చేశారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్రం ఇస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ రాష్ట్రానికి మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించారన్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు.ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ ప్రధానిగా భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు.రాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు

..మిగతా 2వ పేజీలో →

## ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా..

**రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి**
**బీఆర్ఎస్, బీజేపీ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్**

ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణ మాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు.

### రైస్ ఉత్పత్తి, కొనుగోలు

ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న సామాజిక న్యాయ విజయ భేరి సభలో సీఎం ఈ మేరకు పేర్కొన్నారు.



## కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి పై సీఎం రేవంత్ ఆరా..!

అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చేరిన మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా యశోదా వైద్యులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని యశోదా వైద్యులను కోరారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై యశోదా వైద్యుల హెల్త్ బులెటిన్ విడుదల చేసారు. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు, నీరసంగా ఉండటంతో... ఆసుపత్రిలో చేరారని వైద్యులు వెల్లడించారు.

**దశ, హైదరాబాద్**

## ఈడీ విచారణకు అల్లు అరవింద్..



**దశ, హైదరాబాద్:** ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 20182019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది ఈడీ. ఇప్పటికే అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు.2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు.

## మాకు మంత్రి పదవి ఇవ్వండి సార్ ప్లీజ్

**మల్లికార్జున్ ఖర్గేకి పోటాపోటీ నివేదికలు అందించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

**దశ, హైదరాబాద్:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గేను శుక్రవారం పలువురు ఎమ్మెల్యేలు కలిసారు. ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, బాలు నాయక్, రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి అయనను కలిసి మాకు మంత్రి పదవి ఇప్పించడని నివేదికలు ఇచ్చారు. అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాలో మంత్రి లేకపోవడం ఇదే మొదటిసారని మల్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బంజారాల్లో 80% మంది కాంగ్రెస్ కి మద్దతుగా నిలిచారని, అయినా తనకు మంత్రి పదవి ఇవ్వలేదని బాలు నాయక్ అన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారిలో మంత్రి పదవి లేనిది తానొక్కడికే అని న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విన్నవించుకున్నారు. పార్టీ సీనియర్గా తనకు అవకాశం ఇవ్వాలని సుదర్శన్ రెడ్డి నివేదికలు అందజేయగా, ఖర్గే మాత్రం ఎవరికీ ఎలాంటి హామీ ఇవ్వకుండా అందరి అభ్యర్థనలను విన్నారు.



## మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణ

**దశ, సికింద్రాబాద్:** ఉజ్జయిని మహంకాళి అమ్మవారి కి మొదటి బోనాన్ని అత్తిలి కుటుంబం నుండి సమర్పించారు.. అమ్మవారి బోనాల జాతరను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మొదటి బోనం అత్తిలి కుటుంబం నుండి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.. అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాంగోపాల్ పేట్ నుండి ఆలయం వరకు తొలి బోనం ను జోగిని శ్యామల తీసుకొచ్చారు.. సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బోనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు... డబ్బు సందేళ్ల మధ్య బోనం సమర్పణ కొనసాగింది.. జోగిని శ్యామల బోనంతో అమ్మవారిని స్మరించుకుంటూ నృత్యాలు చేస్తూ భక్తి పరవశంతో ఆలయానికి చేరుకున్నారు..



## అది దుర్మార్గమైన చర్య: కేటీఆర్

ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు.

వివరాలు 2లో

## కొత్తపేట ఓజోన్ దవాఖానలో దారుణం

**వైద్యుల నిర్లక్ష్యంతో రైతు మృతి. ఠాగూర్ సినిమా స్టైల్లో వైద్యం చేశారని బంధువుల ఆరోపణ.**



**దశ, ఎల్బీనగర్:** వైద్యుల నిర్లక్ష్యంతో ఒక రైతు మృతి చెందిన ఘటన కొత్తపేట లోని ఓజోన్ దవాఖానలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. చనిపోయిన వ్యక్తికి వైద్యం చేశారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే... సూర్యాపేట జిల్లా పెనుపహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి భగవంత్ రెడ్డి (60), భార్య దుర్గమ్మ (50). వృత్తిరీత్యా స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 30వ తేదీన ఒంట్లో నలతగా ఉందని ఎన్టీఆర్ నగర్ లోని ఓజోన్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. భగవంత్ రెడ్డికి పూర్తిగా వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని సూచించారు. అందుకు గాను రూ. 8 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని ఈనెల 2వ తేదీన ఉదయం సుమారు 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు రెండు దఫాలుగా ఆపరేషన్లు నిర్వహించినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దాదాపు 20 యూనిట్ల రక్తాన్ని ఎక్కించి, రెండు రోజులుగా ఎవరిని కూడా ప్రత్యేక చికిత్స విభాగానికి పోకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బాధిత రైతు కుటుంబ సభ్యుల ఐసీయూలోకి వెళ్లి చూడగా అప్పటికే భగవంత్ రెడ్డి చనిపోయినట్లు నిర్ధారించుకున్నారు. రెండు రోజుల క్రితం చనిపోయిన మృతదేహానికి రక్తం ఎక్కించి తమను మోసం చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న చైతన్యపురి పోలీసులు విచారణ చేస్తున్నారు.



## రోశయ్య విగ్రహావిష్కరణ

**దశ, హైద్రాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తో కలిసి సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ లక్డీకాపూల్ లో కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు , పొన్నం ప్రభాకర్ , ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, రోశయ్య గారి కుటుంబ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు హాజరయ్యారు.

దశ
నిజం.. నిర్భయంగా..

02
శనివారం
5-7-2025
WWW.
DASHANEWS
.COM



## చరిత్రలో ఈ రోజు

**1811:** వెనెజులా స్వాతంత్ర దినోత్సవం (దక్షిణ అమెరికాలో స్వాతంత్రం (స్పెయిన్ నుంచి) పొందిన మొట్టమొదటి దేశం).
**1916:** భారతదేశ 7వ రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ జననం (మ.1994).
**1927:** తెలుగు రచయిత, జ్ఞానపీఠ బహుమతి గ్రహీత రావూరి భరద్వాజ జననం (మ.2013)..(చిత్రంలో)
**1946:** 'బికిని' ఈత దుస్తులు మొదటిసారిగా పారిస్ ఫ్యాషన్ ప్రదర్శనలో కనిపించాయి.
**1947:** భారతదేశానికి స్వాతంత్ర్యాన్నిచ్చే చట్టం బ్రిటిషు పార్లమెంటులో ప్రవేశపెట్టారు.
**1954:** ఆంధ్ర రాష్ట్ర హైకోర్టును నెలకొల్పారు.
**1962:** అల్జీరియా స్వాతంత్ర్యదినోత్సవం.
**1975:** కేప్ వెర్డె స్వాతంత్ర్య దినోత్సవం. (500 సంవత్సరాల పోర్చుగీస్ వలస పాలన తర్వాత)

## మొబైల్ పేలి వ్యక్తికి తీవ్ర గాయాలు

**దశ, రంగారెడ్డి:** ప్యాంట్ జేబులో ఉన్న మొబైల్ పేలడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలైన ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీనివాస్ అనే యువకుడు మొబైల్ ఫోన్ ను జేబులో పెట్టుకొని నడుకేజుకుంటూ వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. పేలుడుతో శ్రీనివాస్ తొడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఓవర్ హీట్ కారణంగా పేలినట్లు పోలీసులు భావిస్తున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం
### ముగ్గురి సజీవ దహనం

**దశ, మహబూబాబాద్:** జిల్లాలోని మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజ్ సమీపంలో జాతీయ రహదారి 563పై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న గ్రానైట్ లారీ, కోళ్ల దాన బస్తాల లారీ ఢీ కొన్నాయి. ఈ రెండు లారీలు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో రెండు లారీల్లోని ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్ సజీవ దహనమయ్యారు. స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. పోలీసులు సంఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిలో ఈ ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్‌ని పోలీసులు క్లియర్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## తాటి చెట్టు పై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి




దశ, ఇబ్రహీంపట్నం : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని బొత్తల ఒంపు ప్రాంతంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కిన గీత కార్మికుడు గుండ్ల జంగయ్య గౌడ్ (45) ప్రమాదవశాత్తూ చెట్టు పై నుంచి కింద పడిపోయారు. నడుము భాగంలో మోకు జరగడంతో జంగయ్య చెట్టు పై నుంచే అదుపు కోల్పోయి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గాయపడిన జంగయ్యను చికిత్స నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జంగయ్య గౌడ్ మృతి చెందారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.

## ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

**దశ, తుర్కయాంజల్:** రంగా రెడ్డి జిల్లా తుర్కయాంజల్ లోని లక్ష్మీ గార్డెన్స్ లో నివాసముండే నల్లగొండ జిల్లా తురుమలగిరికి చెందిన రంగ బాబు (40) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేస్కొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్న ఆదిభట్ల పోలీసులు తెలిపారు.

# నిరుద్యోగులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య: కేటీఆర్



**దశ, హైదరాబాద్ :** ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు.అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీని పిలిపించి మరీ నిరుద్యోగులతో చాయ్ పే చర్చ పెట్టిన రేవంత్‌కు గద్దెనెక్కిన తరువాత జాబ్ క్యాలెండర్ అసలు గుర్తే లేదా..? చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నిరుద్యోగులు హైదరాబాద్ రాకుండా ముందుగానే నిర్బంధించడమే దారుణమైతే, ఇవాళ సచివాలయానికి గోడు చెప్పుకునేందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు.యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మరీ మోసం చేసిన రేవంత్ ఏడాదిన్నర కాలంలో పట్టుమని పదివేల ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం నిరుద్యోగులకు వెన్నుపోటు పొడవడమే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ పూర్తి చేసిన 60 వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకున్న చేతకాని సీఎం ని నిరుద్యోగులు ఎప్పటికీ క్షమించరు. చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపట్టిన నిరుద్యోగులను అక్రమంగా అరెస్టుచేసి వారి గొంతులు నొక్కలేరు. వెంటనే వారందరినీ బేషరతుగా విడుదల చేసి ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను ఇప్పటికైనా నిలబెట్టుకోవాలి. లేకపోతే రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి రేవంత్ సర్కారు మెడలు వంచుతాం.. కాంగ్రెస్ సర్కారు చేసిన ద్రోహాన్ని గడపగడపకూ తీసుకెళ్లి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడతాం అని కేటీఆర్ హెచ్చరించారు.




## న్యాయ సమరభేరి కాదు.. సామాజిక అన్యాయ సభ: బీజేపీ

**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న సభను "సామాజిక న్యాయ సమరభేరి"గా ప్రకటించినా.. వాస్తవంగా చూస్తే ఆ సభ "సామాజిక అన్యాయ సభ"గా మిగిలి పోతోందని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 18 నెలలు పూర్తయ్యాయి. కనీసం ఈ సభ వేదికపై అయినా ఇప్పటిదాకా వారు చేసిన పని ఏమిటో ప్రజలకు జవాబుదారీగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. "జై బాపూ, జై భీమ్, జై సాంవిధాన్" అనే నినాదాలను తీసుకువచ్చిన కాంగ్రెస్ పార్టీనే, వాస్తవానికి ఈ ముగ్గురు మహానుభావుల ఆలోచనలకు పూర్తిగా విరుద్ధంగా పనిచేసిన పార్టీ అన్నారు. బాపూ, భీమ్, రాజ్యాంగం - ఈ మూడు పేర్లను భావజాలంగా హత్య చేసిన పార్టీ కూడా కాంగ్రెస్ అన్నారు. అందుకే ఎల్బీ స్టేడియంలో జరుగుతున్నది సామాజిక న్యాయ సభ కాదు. ఇది కాంగ్రెస్ పార్టీ తన పాపాలను కప్పిపుచ్చుకునే వేదిక మాత్రమే అన్నారు. ఈ సమావేశంలో తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి కడియం రామచంద్రయ్య సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్ మెట్టు తహసీల్దార్ కార్యాలయం ముందు అర్ధనగ్న నిరసన



**దశ, అబ్దుల్లాపూర్మెట్:** కోర్టు ఉత్తర్వులు ఉన్నా మాకు ఎలాంటి న్యాయం చేయడం లేదని సైదాబాద్ కు చెందిన గిరిధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం అబ్దుల్లాపూర్ మెట్టు తహసీల్దార్ కార్యాలయం అర్ధనగ్న నిరసనకు దిగారు. రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్, అప్పటి మెట్టు తహసీల్దార్ తన ల్యాండ్ అక్రమంగా ఇతరులకి రిజిస్టర్ చేశారనీ ఆరోపణ చేశారు. తట్టి అన్నారం గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 109,110 లో 6 ఎకరాల భూమిని ఎలాంటి నోటీసులు లేకుండా ఇతరులకి బదిలీ చేయటం మళ్ళీ పాస్ బుక్ వచ్చాక రెవెన్యూ అధికారులు తమ వద్దనే ఉంచుకున్నారన్నారు. గత 9 సంవత్సరాలుగా ఎం ఆర్ ఓ కార్యాలయం చుట్టూ తిరిగిన న్యాయం చేయలేదంటూ నిరసన తెలిపినట్టు బాధితుడు తెలిపారు. గతం లో ఉన్న ఏం అర్ ఓ లు అనిత మరియు రవీందర్ దత్ ల పై కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు దాఖలు చేశామన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న గిరిధర్ రెడ్డి నీ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాగా తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ల్యాండ్ పై కోర్ట్ స్టేటస్కో ఉన్నందున మేము చట్ట ప్రకారం వెళ్తున్నాము, రిజిస్ట్రేషన్ చేయలేమని చెప్పాము . గతం లో కోర్టు ఆదేశాల ప్రకారం విచారణ చేసి ఇరు వర్గాలని పిలిపించి రిజిస్టర్ పోస్ట్ ద్వారా నోటీస్ కూడా ఇవడం జరిగిందన్నారు. ఏదైనా కోర్టు లో తేల్చుకొమ్మని సూచించారు.




## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
### అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

**దశ, అబ్దుల్లాపూర్మెట్:** ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కుంట్లూరు గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 78లో ఉన్న ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అదేవిధంగా తారామతిపేట గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 470, పసుమాముల గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 58లలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ, అసైన్డ్ భూములలో నిబంధనలు పాటించకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే.. ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రాము, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే..

**మొదటి పేజీ తరువాయి**

ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు.



శిల్పకళా వేదిక హైటెక్ సిటీ హైదరాబాద్ లో అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి వేడుకలు సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ విచ్చేసిన సందర్భంగా బేగంపేట్ ఎయిర్ పోర్ట్ లో జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, అదనపు సిపి విక్రమ్ సింగ్ మాన్, డిసిపి రష్మి పెరిమాల్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందజేశారు.
...: దశ, హైదరాబాద్




## నల్లగండ్ల నాలా పనులకు తొలగిన ఆటంకాలు

**దశ, హైదరాబాద్:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో వరద నీరు సాఫీగా సాగేందుకు ఉన్న ఆటంకాలను హైడ్రా తొలగించింది. నల్లగండ్ల చెరువు నుంచి వచ్చే వరద నీటి కాలువ పనులు ఇక జోరందుకోనున్నాయి. స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రొగ్రాం కింద 2 కిలోమీటర్ల మేర ఈ వరద నీటి కాలువను నిర్మిస్తున్న విషయం విధితమే. ఈ నాలా చాలా చోట్ల ఆక్రమణలకు గురయ్యింది. కొన్ని చోట్ల ఇంటి యజమానులు ముందుకొచ్చి ఆక్రమణలను తొలగించగా.. మరి కొంతమంది అభ్యంతరాలు తెలిపారు. దీంతో నాలా పనులు ముందుకు సాగడం కష్టంగా మారింది. ఈ తరుణంలో ఎస్ ఎన్‌డీపీ ప్రాజెక్టు నిర్వాహకులు హైడ్రాను ఆశ్రయించారు. ఇదే సమయంలో నీటి ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి కూడా స్థానికులు హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేశారు.

### ఆటంకాలాను తొలగించిన హైడ్రా..

2 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉన్న నాలా కేవలం.. 230 మీటర్ల మేర పూర్తయ్యింది. నల్లగండ్ల హుడా కాలనీలో సమస్య తలెత్తింది. ఒక అపార్టుమెంట్ ప్రహరీతో పాటు కొంత నిర్మాణం నాలాపైనే ఉంది. ఇదే మాదిరి మరి కొన్ని చోట్ల కూడా సమస్య తలెత్తడంతో ఎస్ ఎన్‌డీపీ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు.

# లక్కీ డ్రా మోసగాళ్లు అరెస్ట్..




**దశ, మిర్యాలగూడ:** లక్కీ డ్రా పేరుతో బహుమతులు ఆశ చూపి మోసం చేసిన ఘరానా మోసగాళ్ల ను నల్లగొండ జిల్లా పోలీసు ముగ్గురిని అరెస్టు చేసినట్టు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్ తెలిపారు. మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో ఆర్కే ఎంటర్ప్రైసెస్ పేరుతో మల్టీ లెవల్ సంస్థను పరిసర ప్రాంతాల సుమారు 2, 143మంది అమాయక ప్రజలను సభ్యులుగా మిర్యాలగూడకు చెందిన కొమ్ము రమేష్, కొమ్ము కోటేశ్వరరావు, బచ్చలకూరు శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తులు చేర్పించుకున్నారనారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆర్కే ఎంటర్ ప్రైజెస్ పేరిట కార్యాలయం తెరిచారు, నెలకు 1,000 రూపాయల చొప్పున చెల్లిస్తే 15 నెలల పాటు డ్రాలో 10 మందికి అదృష్టం బాగుంటే లక్కీ డ్రాలో విలువైన కార్లు, బైక్లు, బంగారు నగలు ఇచ్చి 15 నెలల తర్వాత డ్రాలో బహుమతి రాకున్నా చెల్లించిన మొత్తం ఇస్తామని నమ్మించి వారి నుండి సుమారు రూ.1,85,79,000ల సేకరించి అందులో రూ.50 లక్షల మేర బహుమతులు ఇచ్చాడన్నారు. 15నెలల కాలపరిమితి బహుమతులు రాని వారు ఫోన్ చేయడంతో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో బాధితులు వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారనీ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. శుక్రవారం సాయంత్రం 4:45 గంటలకు ఈదులగూడ చౌరాస్తా వద్ద రమేష్, కోటేశ్వరరావు, బచ్చలకురి శ్రీనివాస్ ను ఆయనంట్లో పట్టుకుని వారి నుండి సుమారు రూ. 70లక్షల విలువైన నగదు రూ.6.55లక్షలు, 2 ఓపెన్ ప్లాట్ల దస్త్రాలు, ముదిమాణిక్యంలో ఫంక్షన్ హాలు లీజుకు తీసుకున్న పాత్రలు, ఫర్నిచర్, 2 బైకులు, వాషింగ్ మిషన్, వాటర్ ప్యూరిఫైయర్, లాప్ టాప్, కంప్యూటర్, బ్రోచర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. లక్కీ డ్రా స్కీంలలో మాయపు మాటలకు చేరి నష్ట పోవద్దని ఎస్పీ అన్నారు. ఇలాంటి మోసాల గురించి తమకు తెలిపితే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కేసును చాకచక్యంగా చేధించినందుకు డిఎస్పీ రాజశేఖర్ రాజు, ఇన్స్పెక్టర్ సిహెచ్. మోతిరామ్, ఎస్ఐ సైదిరెడ్డి, కానిస్టేబుల్స్ ఎం.శ్రీను, జి.నరసింహా, ఎం. సైదులు, బి.వీరబాబు, ఎస్కే. తమీజుద్దీన్, ఆర్.సైదులు బి. ప్రసాద్ లను అభినందించారు.

దశ
నిజం.. నిర్భయంగా..
03
శనివారం
05-7-2025
WWW.
DASHANEWS
.COM



## మొహరం.. పటిష్ట బందోబస్తు ; సీపీ ఆనంద్

**దశ, హైద్రాబాద్:** మొహరం సంతాప దినాలను పురస్కరించుకొని, హైదరాబాద్ నగరంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డిజి సీవీ ఆనంద్ తెలిపారు. శుక్రవారం మొహరం 8వ రోజు సందర్భంగా దార్‌ఉల్‌షిఫా, డబీర్‌పురాలోని బీబీ కా ఆలంను సందర్శించి, అక్కడ పుష్పగుచ్ఛాలు, దట్టిలు సమర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తు మరియు భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మొహరం సంతాప దినాలు నేటికి 8వ రోజుకు చేరుకున్నాయని, మొహరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం తరపున గౌరవనీయులైన మంత్రులు, షియా మత పెద్దలు, పోలీసు మరియు ఇతర శాఖల అధికారులతో అనేక సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం,ఆదివారం మొహరం రోజున భారీ సంఖ్యలో ప్రజలు సందర్శించే అవకాశం ఉన్నందున, ముందస్తు చర్యలో భాగంగా 3000 మంది పోలీసులతో మొహరం ఊరేగింపు శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా బందోబస్తు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

## సింగరేణిలో రోశయ్య జయంతి వేడుకలు

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** సింగరేణి



ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ ఆవరణలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తమిళనాడు కర్నాటక మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా జిఎం(సేఫ్టీ) సిహెచ్.శ్రీనివాస్ హాజర య్యారు. ఈ కార్యక్రమంలో జిఎం(సేఫ్టీ) శ్రీ సిహెచ్.శ్రీనివాస్ తో పాటు గుర్తింపు సంఘం (ఏఐటియూసి)బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం కార్పొరేట్ బ్రాంచ్ సెక్రటరీ సిహెచ్. మహేష్ కుమార్, కార్పొరేట్ సిఎంఓఏఐ అధ్యక్షుడు ఎస్.వెంకటాచారి, జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(స్టోర్స్) పి.ఎలిషా, జిఎం(హెచ్‌ఆర్‌డి)టి.వెంకట రామి రెడ్డి, డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కార్పొరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైద్యసేవలో నిర్లక్ష్యం సహించం
### కలెక్టర్ హనుమంతరావు

**దశ, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు . సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి లో ల్యాబ్, ఫార్మసీ, ఎమర్జెన్సీ వార్డు లను పరిశీలించారు.ఆసుపత్రి లోని అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసి ఎంత మంది సిబ్బంది విధులకు హాజరయ్యారని పరిశీలించారు. డాక్టర్స్, హాస్పిటల్ సిబ్బంది రెగ్యులర్ గా వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓపి రిజిస్టర్ ని చెక్ చేశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారని ఆసుపత్రి సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందుబాటులోఉండి..వైద్యంకోసం వచ్చిన వారికి సకాలంలో స్పందించి వైద్యం అందించారు అన్నారు. ఆసుపత్రికి ఎంత మంది గర్భిణి స్త్రీలు వస్తున్నారని, ఎంత మంది చెకప్ చేసుకుంటున్నారని, వాళ్ళకి ట్రీట్మెంట్ సరిగా ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఫార్మసీ లో మందుల కొరత లేకుండా చూ డాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ సుగుణ రాజు అనధికారిక గైర్హాజరు కారణంగా షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆదివాసీల అభివృద్ధికి పోలీస్ శాఖ కృషి

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజు .. కుటుంబాలకు దుప్పట్లు దోమతెరల పంపిణీ



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఆదివాసీ ప్రజల సంక్షేమం అభివృద్ధి కొరకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని గంగమ్మ కాలనీ గుత్తికోయ గ్రామంలో లక్ష్మీదేవిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీల సంక్షేమం అభివృద్ధి కోసం పోలీస్ శాఖ తరఫున ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు. వర్షాకాలంలో తమ ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికంగా మురుగు నీరు చేరడం వలన దోమలు అధికమై డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాల బారిన పడే అవకాశం ఉందని సూచించారు. అనంతరం ఎస్పీ చేతుల మీదుగా అక్కడ నివసించే 27 కుటుంబాల వారికి దుప్పట్లు దోమ తెరలను పంపిణీ చేశారు. విద్యుత్ మొబైల్ నెట్వర్క్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మద్దె గుంపుకు చేరుకొని అక్కడ నివసిస్తున్న ఆదీవాసీ ప్రజల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి, ఎస్సై కార్తీక్, లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బంది స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి
### డీఈఓకు విద్యార్థి సంఘం వినతి



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరుతూ శుక్రవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో డీఈవో ఎం.వెంకటేశ్వర చారికి వినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జె.గణేష్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం జిల్లా యంత్రాంగం అశ్రద్ధ వహించిందని తెలి పారు. ముఖ్యంగా పాఠశాలలలో తాగునీటి సమస్య మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. మహిళా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత త్రాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

తక్షణం జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.అరుణ్ జె.చంటి బి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. శుక్రవారం బిసి సంక్షేమ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్నకలెక్టర్ కొమురయ్యచిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం విముక్తి పోరాటాన్ని చేసిన మహనీయుడు కొమురయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మాట వినపడగానే మొట్ట మొదట గుర్తుకొచ్చేది దొడ్డి కొమురయ్య పేరేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, బీసీ సంక్షేమ అధికారిని ఇందిర, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, క్రీడల అధికారి పరంధామ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనంత రామకృష్ణ, కురుమ సంఘ సభ్యులు దూడల బుచ్చయ్య, లింగయ్య, రవికుమార్, చంద్రశేఖర్, దూడల కిరణ్, సుంక ప్రవీణ్, కోటిలింగం, సంపత్ కుమార్, రవి కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్

దశ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు మరో ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసేందుకు టీజీపీఎస్సీ సమాయాత్తమవుతోంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో దాదాపు 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల (డిప్యూటీ ఈఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు 110 అధ్యాపకులు, 8 పీడీ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి త్వరలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు విద్యాశాఖ ఇప్పటికే టీజీపీఎస్సీకి అందించింది. నిజానికి, పాఠశాల విద్యాశాఖ పరిధిలో డిప్యూటీ ఈఓలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, ఎస్‌సీఈఆర్‌టీలోని అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులతోపాటు మొత్తం 134 పోస్టులను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ 2022లోనే అనుమతి ఇచ్చింది. ఇందులో 24 డిప్యూటీ ఈఓ, 110 అధ్యాపక, సీనియర్ అధ్యాపక పోస్టులు ఉన్నాయి. ఈ 134 పోస్టులతో పాటు తాజాగా దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో 8 ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టులు భర్తీ చేసేందుకు కమిషన్‌కు ప్రతిపాదనలు అందాయి. మొత్తంగా 142 పోస్టులకు త్వరలోనే 5 వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.ఉమ్మడి తెలంగాణ పరిధిలో మొత్తం 72 డిప్యూటీ ఈఓ పోస్టులు ఉండేవి. ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒకటి చొప్పున గతంలో కేటాయించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో రెవెన్యూ డివిజన్లు రెండే ఉన్నప్పటికీ.. జనాభా, పాఠశాలలు సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. దీంతో హైదరాబాద్ జిల్లాకే ఏకంగా 12 పోస్టులు రానున్నాయి.



సందర్భం

# ఫ్రిజ్ ఎందుకు పేలుతుంది?

### సనత్ నగర్ లో కలకలం రేపిన ఫ్రిజ్ పేలిన ఘటన

### స్పష్టమైన హెచ్చరిక అంటున్న నిపుణులు

హైదరాబాద్‌లోని సనత్‌నగర్ రాజానగర్ ప్రాంతంలో గత గురువారం ఫ్రిజ్ పేలిన ఘటన కలకలం రేపింది. ఓ ఇంట్లో ఉన్న రిఫ్రిజిరేటర్ అకస్మాత్తుగా పెద్ద శబ్దంతో పేలిపోవడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ప్రాణాపాయం జరగలేదు. కానీ ఈ ఘటన మనందరికీ ఒక స్పష్టమైన హెచ్చరిక. మన ఇళ్లలో రోజూ నిత్యవసరాల కోసం వాడే ఫ్రిజ్ కూడా ప్రమాదానికి దారి తీయగలదన్న విషయాన్ని ఇది రుజువు చేసింది. భారీ శబ్దం.. ఈ ఘటనలో ఇంటి సభ్యులు తెల్లవారుజామున ఫ్రిజ్ నుంచి గట్టిగా పేలుడు శబ్దం విన్నారని చెప్పారు. వెంటనే అక్కడ మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వారు వెంటనే ఇంటి నుంచి బయటికి పరుగులు తీశారు. ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందగానే ఫైర్ టెండర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశాయి. ప్రాథమికంగా అధికారులు ఈ పేలుడు ఫ్రిజ్‌లోని కంప్రెసర్ వల్ల జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి కారణాలు తెలియజేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. ఎలా పేలుతుంది? ఇక్కడ అసలు ప్రశ్న ఎమిటంటే ఫ్రిజ్ ఎలా పేలుతుంది? రిఫ్రిజిరేటర్ అనే పరికరం మనకు రోజూ ఉపయోగపడుతుంటుంది. అది శబ్దం చేయదు, ప్రమాదకరంగా కూడా కనిపించదు. కానీ పక్కాగా ఉపయోగించకపోతే.. అది కూడా ముప్పుగా మారవచ్చు. ముఖ్యంగా కంప్రెసర్ సమస్యలు, గ్యాస్ లీక్, వోల్టేజ్ ఫ్లక్చుయేషన్స్ వల్ల ఫ్రిజ్‌లో పేలుడు సంభవించే అవకాశముంది. కంప్రెసర్ ఓవర్‌హీట్ అయినప్పుడు లేదా గ్యాస్ అధికంగా జమైపోయినప్పుడు, ఏ చిన్న షార్ట్‌సర్క్యూట్ లేదా స్పార్క్ కూడా ప్రమాదానికి దారి తీయగలదు. ఇలా చేస్తే సేఫ్.. ఇలాంటి ప్రమాదాలు నివారించాలంటే కొన్ని భద్రతా చర్యలు తప్పనిసరి. ముందుగా, నాణ్యమైన బ్రాండ్‌కి చెందిన ఫ్రిజ్‌ను మాత్రమే కొనుగోలు చేయాలి. చీప్ బ్రాండ్లు, నకిలీ వస్తువులు లోపభూయిష్టంగా తయారవుతాయి. ఫ్రిజ్‌కు ప్రత్యేకంగా ఒకే ప్లగ్ పాయింట్ కల్పించాలి. మల్టీ ప్లగ్‌లలో టీవీ, వాషింగ్ మెషీన్, మైక్రోవేవ్ వంటివి కలిపి వాడటం ప్రమాదకరం. వోల్టేజ్ సమస్యలు ఉండే ప్రదేశాల్లో స్టాబిలైజర్ వాడటం ఉత్తమం. అదనంగా, ఫ్రిజ్ వెనక భాగం వేడిగా అనిపిస్తే, గ్యాస్ వాసన వస్తే లేదా ఎలక్ట్రిక్ స్పార్కింగ్ వంటివి కనిపిస్తే వెంటనే టెక్నీషియన్‌ను సంప్రదించాలి. ఇంకొంత మంది ఫ్రిజ్‌ను పగటి సమయంలో ఓపెన్ చేస్తూ, రాత్రిళ్లు పూర్తిగా మూసివేస్తూ ఉండటం చూశాం. కానీ దీని వల్ల కంప్రెషర్ నిరంతరం పని చేస్తూ వేడిని ఉత్పత్తి చేస్తుంది. అది ఓవర్ లోడ్ అవడం వల్ల పేలుడు సంభవించే అవకాశం ఉంది. అలాగే ఫ్రిజ్‌లో పదార్థాలను నింపడం వల్ల గాలి ప్రసరణ జరగకపోవడం వల్ల కూడ ఫ్రిజ్ ఓవర్ హీట్ అవుతుంది. ఎప్పటికప్పుడు క్లీనింగ్, సర్వీసింగ్ చేయడం మంచిది. ఈ ఘటనలో మంటలు త్వరగా అదుపులోకి రావడంతో నష్టం తక్కువగా ఉంది. కానీ ఇదే మరొక ఇంట్లో జరిగితే పరిస్థితి భిన్నంగా ఉండేది. ప్రతి ఇంట్లో రిఫ్రిజిరేటర్ ఒక తప్పనిసరి పరికరమైపోయిన ఈ రోజుల్లో, దీన్ని ఎలా వాడాలో తెలుసుకోవడం అత్యవసరం. ఇంట్లో ఉండే చల్లదనం కలిగించే పరికరం.. చెలరేగే మంటలకు కారణమవుతుందా? అనే అనుమానం ఎంత తీవ్రంగా ఉంటుందో.. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అది నిజంగా జరిగే ప్రమాదం. ఫ్రిజ్ వాడకంలో నిర్లక్ష్యం ప్రాణాలకు హానికరమయ్యే ప్రమాదం ఉన్నందున, కుటుంబ సభ్యుల రక్షణ కోసం మేము తీసుకునే ముందు జాగ్రత్తలే మన భద్రతకు బలమైన గోడ. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. చిన్న ఘటనలు, పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. అందుకే అప్రమత్తతే అసలైన రక్ష

..: దశ, స్టేట్ బ్యూరో :..

మోత్కూర్ మండల పోలీస్ స్టేషన్ ఇటివల నూతన బాధ్యతలు చేపట్టిన సీఐ వేంకటేశ్వర్లు ని శుక్రవారం మోత్కూరు బీజేపీ మండల అధ్యక్షులు గూదే మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంలో స్టేషన్ ఆవరణలో ఒక్క మొక్క నాటి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు పోచం సోమయ్య, అండెమ్ సుధాకర్ రెడ్డి, చింతల నర్సిరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి పైళ్ల సతీష్ వేముల దశరథ కార్యదర్శి బత్తిని సతీష్ బూత్ అధ్యక్షులు నల్లబోగులా వెంకటేష్ కడమంచి సైదులు అన్నపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
( **దశ, మోత్కూర్** ).



## డీఎస్పీ రహమాన్ సేవలు అభినందనీయం
### డాక్టర్ ఆచార్య మద్దెల శివకుమార్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** పోలీసు వ్యవస్థకే ప్రతిష్టను తీసుకువస్తున్న డీఎస్పీ రెహమాన్ సేవలు అభినందనీయం స్ఫూర్తిదాయకమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పేర్కొన్నారు.శుక్రవారం కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ జన్మదిన సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన బృందంతో డిఎస్పి కార్యాలయానికి వెళ్లి గజమాల రాజతలపాగా పూలమాలల శాలువాలతోను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ రెహమాన్ పేదవర్గాలకు బాధితులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ కు అసలు సిసలైన నిర్వచనంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు ఎస్ కే.దస్తగిరి, మొక్కల రాజశేఖర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు గిడ్ల పరంజ్యోతిరావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు రాజా, అంబేద్కర్ సంక్షేమ సంఘం మహిళ నాయకురాళ్లు బడికల పుష్పలత, కొచ్చర్ల కమల రాణి, రచయిత్రి సుమిత్ర దేవి, ఏజెన్సీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, ఆదివాసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసం రామకృష్ణ, కొండ్ర చంద్రశేఖర్, సలిగంటి కొమరయ్య, చరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు